క్లుప్తంగా

హైవేపై వసూళ్లు



టేకులోడు క్రాస్‌లో 544ఈ జాతీయ రహదారిపై ఆటోను చుట్టుముట్టిన దృశ్యం

చిలమత్తూరు: జాతీయ రహదారులపై కొందరు వినాయక చందాల పేరుతో పర్యాటకులకు చుక్కలు చూపిస్తున్నారు. కొడికొండ చెక్ పోస్ట్ నుంచి లేపాక్షి వరకూ 544ఈ జాతీయ రహదారిపై గుంపులు నిల్చొని వేగంగా వెళ్లే కార్లు, ఇతర వాహనాలకు సైతం తాళ్లు, వైర్లుతో అడ్డగించి దౌర్జన్యంగా వసూలు చేస్తున్నారు. ఈ తరహా వసూళ్లను తామెన్నడూ చూడలేదని వాహనదారులు వాపోతున్నారు. పోలీసులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగితే మాత్రం ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనరసింహ

అమరాపురం: ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో వీఆర్‌ఏలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ లక్ష్మీనరసింహ సూచించారు. సోమవారం మండలంలోని వీఆర్‌ఏలతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలిచ్చారు. విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగలు, తదితర ప్రదేశాల్లో ప్రజలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందుకున్న విద్యార్థులు

హిందూపురం టౌన్: ఒంగోలులో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో హిందూపురానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సోమవారం కరాటే శిక్షకుడు సెన్సేయ్ ఫైరోజ్ మాట్లాడుతూ కట కేటగిరిలో ధనుష్, నేహ గోల్డ్ మెడల్, రిషి రామ్, కిషోర్ సిల్వర్ మెడల్లను సాధించారన్నారు. అలాగే ఫైట్ కేటగిరిలో ధనుష్, కిశోర్ గోల్డ్ మెడల్‌ను, నేహా సిల్వర్ మెడల్, రిషి రామ్ బ్రాంజ్ మెడల్‌ను సాధించారని పేర్కొన్నారు. అలాగే సీనియర్లు ఉసామా ఖాన్, గీతికలు ఉత్తమ రెఫరీలుగా మొమెంటోలను అందుకున్నట్లు చెప్పారు.

పోస్టల్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: విద్యార్థులకు తపాలా సేవలపై అవగాహన కల్పించడానికి పోస్టల్ శాఖ అనేక రకాలైన కార్యక్రమాలు నిర్వహిస్తోందని హిందూపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులు 2025–26 ఏడాది దీన్‌దయాళ్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్ పొందవచ్చన్నారు. ప్రస్తుతం 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. సెప్టెంబర్ 16వ తేదీలోపు స్కాలర్‌షిప్ టెస్టుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు హిందూపురం హెడ్ పోస్టాఫీసులో సంప్రదించాలన్నారు.

ఎటు చూసినా బీడు భూములే..

హిందూపురం డివిజన్‌లో ఖరీఫ్–2025 సాగు గణనీయంగా తగ్గిపోయింది. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతులు పంటల సాగుకు ముందుకు రాలేదు. దీంతో ఎటు వైపు చూసినా అధిక సంఖ్యలో బీడు భూములే దర్శనమిస్తున్నాయి.

- వాతావరణ మార్పులు, వర్షాభావంతో పంటల సాగుపై వెనక్కి తగ్గిన రైతాంగం
- అధిక వర్షాలకు వేసిన పంటలూ చేతికందవంటున్న అన్నదాతలు



రొద్దంవారిపల్లి వద్ద పంటలు సాగు చేయకపోవడంతో బీడుగా ఉన్న భూములు



చిత్రంలో కనిపిస్తున్న రైతు లేపాక్షి మండలం కొండూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి. ఈయన రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. సుమారు రూ.50 వేలు పెట్టుబడి పెట్టారు. మొక్కజొన్నకు మొలకలొచ్చాయి. అయితే వర్షాలు కురవలేదు. వర్షం రాకపోవడంతో పంట ఎండిపోయింది. దీంతో ట్రాక్టర్‌తో మొత్తం పంటను దున్నేశాడు. ఇప్పుడు వర్షం కురుస్తుండటంతో కాస్త తెరపు విడిస్తే పంటపై ఆలోచిస్తానంటున్నారు.

చిలమత్తూరు: ఖరీఫ్ సాగు కంటే ముందుగానే వర్షాలు కురవడం, పంట విత్తే సమయానికి వర్షాలు రాకపోవడంతో రైతులు పూర్తిగా ఖరీఫ్‌పై ఆశలు వదులుకున్నారు. హిందూపురం డివిజన్‌లో హిందూపురం, చిలమత్తూరు, లేపాక్షి, పరిగి, గోరంట్ల మండలాలు వస్తాయి. ఖరీఫ్‌లో సాధారణంగా ఈ డివిజన్‌లో మొక్కజొన్న, వేరుశనగ, కంది ప్రధానంగా పండిస్తారు. 2024 ఖరీఫ్‌తో పోలిస్తే ఈ ఏడాది పంటల సాగు 70 శాతం మేర తగ్గిపోయింది.

హిందూపురం డివిజన్‌లో పంటల సాగు ఇలా..		
సంవత్సరం	సాధారణ సాగు	సాగు చేసిన విస్తీర్ణం
2024	25,260హెక్టార్లు	19,831 హెక్టార్లు
2025	21,775హెక్టార్లు	7,209 హెక్టార్లు

కరువును తలపించేలా..

2024 ఖరీఫ్, ఈ ఏడాది ఖరీఫ్ గణాంకాలు చూసినట్లయితే హిందూపురం డివిజన్ వ్యాప్తంగా ప్రధాన పంటలు 21,775 హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం కేవలం 7,209 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగు చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో హిందూపురం డివిజన్ వ్యాప్తంగా ఎటు చూసినా బీడు భూములు దర్శనమిస్తున్నాయి. కరువును తలపించేలా పరిస్థితులు మారుతున్నాయి. రైతులకు వ్యవసాయ బోరు బావుల కింద వేసుకున్న పంటలే తప్ప వర్షాధారిత పంటలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. భూములను ఖాళీగా ఉంచలేక సమయం మించినా కొందరు రైతులు పంటలను సాగు చేశారు. అవి కూడా దిగుబడులు సరిగా వచ్చే పరిస్థితులు కనిపించడం లేదంటూ ఆందోళన చెందుతున్నారు.

అరకొరగా పంట సాయం

అన్నదాత సుఖీభవ పథకం కింద పంట సాగుకు రూ.20 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ సాయాన్ని మూడు విడతల్లో ఇస్తామని మాట మార్చడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. రూ.7 వేలు ఇస్తే ఏం చేసుకోవాలని, ఇలాంటి సాయం తామెన్నడూ చూడలేదని, ఇది పంటల సాగుకు ఏ విధంగా మేలవుతుందని ప్రశ్నిస్తున్నారు.

ఉన్న పంటలకు వర్షం దెబ్బ

అరకొరగా బోరుబావులు, వర్షాధారిత పంటలను వేసిన రైతులకు అకాల వర్షాలు కొంపముంచుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉన్న పంటలు దెబ్బతినే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కలుపు తీసే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో పంటల్లో గడ్డి విపరీతంగా పెరిగిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

పంటల సాగు పెరగవచ్చు

ఖరీఫ్ సాగుకు అనుకూలంగా వర్షాలు కురవలేదు. పంట విత్తే సమయానికి వర్షాలు లేకపోవడంతో వేరుశనగ సాగు తగ్గింది. హిందూపురం డివిజన్‌లో మొక్కజొన్న సాగు అధికంగా ఉంటుంది. ఇప్పుడు వర్షాలు కురుస్తున్నాయి. కాబటి మరో వారం రోజుల్లో సాగు పెరిగే అవకాశాలు ఉన్నాయి. మొక్కజొన్న వెయ్యకపోతే ఉలవలు ఇస్తాం.

– కృష్ణయ్య, ఏడీఏ , హిందూపురం

కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం



రైతాంగానికి కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. అన్నదాత సుఖీభవ మొత్తం మూడు విడతల్లో ఇస్తామని చెప్పడం సిగ్గుచేటు. ఎప్పుడూ లేనంతగా 75 శాతం ఖరీఫ్ సాగు తగ్గడం ఆశ్చర్యం కలిగిస్తోంది. చెరువులకు నీళ్లిస్తామని చెప్పి మోసం చేశారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని రైతులే చెబుతున్నారు. పంటలు వేయని రైతులకు ఆర్థిక సాయం చేయాలి.

– టీఎన్ దీపిక , వైఎస్సార్సీపీ సమన్వయకర్త

నేడు అభివృద్ధి కమిటీ సమావేశం

రొళ్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం ఆస్పత్రి అభివృద్ధి కమిటీపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు డాక్టర్ బాల ప్రణీత్‌రెడ్డి తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది హాజరు కావాలన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

హిందూపురం: హిందూపురం–బెంగళూరు వెళ్లే రైలులో ప్రయాణం చేస్తూ యలహంక సమీపంలో రైలు నుంచి జారి పడి సోమవారం ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు హిందూపురం ప్రాంత వాసిగా చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



చిరంజీవిని పరామర్శిస్తున్న ఈరలక్కప్ప

మడకశిరరూరల్: మండల పరిధిలోని తురుకువాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిరంజీవి పొలంలో కాలు జారి కింద పడడంతో గాయపడ్డారు. చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి తదితరులు సోమవారం చిరంజీవిని పరామర్శించారు.

హైవేపై వాహనం బోల్తా



బోల్తాపడిన టాటా 407 ఎస్ఎఫ్‌సీ వాహనం

పరిగి: మండల కేంద్రమైన జాతీయ రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాలమేరకు అనంతపురం జిల్లా గుమ్మఘట్టకు చెందిన ఓ కుటుంబ సభ్యులు కర్ణాటకలోని చింతామణి వద్ద కేబుల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో టాటా 407 ఎస్ఎఫ్‌సీ వాహనంలో చింతామణి నుంచి సొంతూరుకు బయలుదేరి వస్తున్నారు. అలాగే సోమందేపల్లి మండలంలోని మండ్లికి చెందిన కిషోర్.. భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై పరిగి నుంచి బయలుదేరి పైడేటి రోడ్డు వైపు వెళ్తున్నాడు. పరిగి జాతీయ రహదారిని దాటుతుండగా వేగంగా వచ్చిన 407 వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడిపోయింది. అయితే అందరూ స్వల్పగాయాలతో బయట పడినట్లు స్థానికులు తెలిపారు.

కూటమి మోసాన్ని ప్రజలకు వివరించండి



క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించిన సీఎం చంద్రబాబు అండ్ కో మోసాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. సోమవారం మండలంలోని వి. అగ్రహారంలో ‘బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ’ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను ఒక్కటీ సరిగా నేరవేర్చలేదన్నారు. చంద్రబాబు చేస్తున్న అన్యాయాలు, మోసాలు, అక్రమాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని మండి పడ్డారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ఉందన్నారు. ఎవరికీ భయపడకుండా వైఎస్.జగనన్న కోసం సైనికుల్లా పని చేయాలని, రాబోవు రోజుల్లో వైఎస్ జగన్ కచ్చితంగా కార్యకర్తలకు న్యాయం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నీరప్ప, మోహన్, ప్రసాద్, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయండి



కార్మికశాఖ అధికారులకు వినతిపత్రమిస్తున్న నాయకులు

హిందూపురం: తూమకుంట స్టీల్ ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తూ మరణించిన కార్మికుడి కుటుంబానికి నష్ట పరిహారం పూర్తిగా ఇవ్వకుండా అన్యాయం చేశారని తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్ విమర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ సోమవారం కార్మికశాఖ సహాయ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందించారు. రవికుమార్ మాట్లాడుతూ జూన్ 10న మీనాక్షి స్టీల్స్ ఫ్యాక్టరీలో బీహార్‌కు చెందిన జిబ్లాల్ యాదవ్ (29) విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ మృతి చెందాడన్నారు. రూ.15.74 లక్షలు బాధిత కుటుంబానికి చెల్లించాలని కార్మికశాఖ అధికారులు యాజమాన్యానికి నోటీసులిచ్చిందన్నారు. అయితే రూ.7.50 లక్షలు బాధిత కుటుంబానికి అందజేసి.. మిగిలిన మొత్తం ఇవ్వకుండా సంతకాలు మాత్రం తీసుకొని మోసం చేశారన్నారు. వెంటనే మిగిలిన మొత్తం డబ్బులు ఇప్పించాలన్నారు.

మహాద్వారం ప్రారంభం



మహా ద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పావగడ: తాలూకా లోని కొడమడుగు గ్రామంలో వెలసిన వీరాంజనేయస్వామి దేవాలయానికి నూతనంగా నిర్మించిన మహా ద్వారాన్ని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వెంకటేశ్ సన్మానించారు.

రహదారులు బాగు చేయండి



వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

చిలమత్తూరు: మండలంలో రోడ్ల దుస్థితి మరీ అధ్వానంగా మారిందని సీపీఎం జిల్లా కమిటీ నేత ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం సీపీఎం నాయకులు ఎంపీడీఓ రమణమూర్తిని కలిసి రోడ్లు మరమ్మతు చేపట్టాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల కమిటీ నేత సుధాకర్, నరసింహ, మంజునాథ్, గోపాలప్ప, అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

వైభవంగా ‘నిడగల్లు’ ఉత్సవాలు

పావగడ: తాలూకాలోని చారిత్రాత్మక, పర్యాటక కేంద్రంగా రూపు దిద్దుకున్న నిడగల్లు దుర్గం ఉత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. శ్రీరామ తీర్థం వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో వాల్మీకి సంజయ కుమార స్వామి మాట్లాడుతూ నిడగల్లు ఉత్సవాలను ప్రతి ఏటా ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరారు. వివిధ కళాకారులు వైవిధ్యమైన కళారూపాలను ప్రదర్శించారు.

సంక్షిప్త సమాచారం

వివిధ సమస్యలపై 9 అర్జీలు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అధికారులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. డివిజన్ వ్యాప్తంగా రెవెన్యూ, ఇతర సమస్యలపై 9 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు.

జాగ్రత్తలు తీసుకోండి

రొళ్ల: వర్షాల నేపథ్యంలో మండల వ్యాప్తంగా రైతులు, కాపర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఏఈ నిజాముద్దీన్ ఒక ప్రకటనలో సూచించారు. విద్యుత్ స్టార్టర్ బాక్స్ తడి చేతిలో ముట్టుకోవద్దని, ఇంటి పైకప్పులులో వాటర్ లీజేకీ ఏమైన ఉంటే మెయిన్ స్విచ్ ఆఫ్ చేసుకోవాలన్నారు.

నేడు మడకశిరకు ఆర్టీసీ ఎండీ రాక

మడకశిర: ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు మంగళవారం మడకశిరకు వస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటలకు మడకశిర ఆర్టీసీ డిపోను పరిశీలిస్తారన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం జిల్లాస్థాయి ఆర్టీసీ అధికారులతో సమీక్షిస్తారన్నారు.

నేడు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపు

హిందూపురం: హిందూపురంలోని మార్కెట్ యార్డు సమీపంలోని మండల సంఘ మిత్ర ఆఫీసులో జిల్లా పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమశాఖ జీఎం జె.నాగరాజు ప్రకటనలో తెలిపారు. రాయితీలు, ఇతర సదుపాయలు తదితర వాటిపై అవగాహన కల్పిస్తామన్నారు.

ఆగివున్న లారీని ఢీకొన్న కారు



దెబ్బతిన్న కారు

పెనుకొండ: పట్టణ సమీపంలోని పులేకమ్మ గుడి–బెహలూల్‌షా దర్గా మధ్యన సోమవారం 44వ నంబర్ జాతీయ రహదారిపై కారు లారీని ఢీకొన్న ఘటన చోటు చేసుకుంది. సోమందేపల్లి, నలగొండ్రాయనిపల్లికి చెందిన కొందరు సోమందేపల్లి నుంచి పెనుకొండకు కారులో బయలుదేరారు. అయితే కారు రహదారిపై అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని ఢీ కొంది. అయితే ప్రమాదంలో ఎవరికీ పెద్దగా గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా కారు ముందు భాగంగా బాగా దెబ్బతింది.

పెనుకొండ మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా రామకృష్ణ

పెనుకొండ: పెనుకొండ మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా రొద్దం మండలం బొక్సంపల్లికి చెందిన రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన మార్కెట్‌యార్డ్‌లో అధికారుల నేతృత్వంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు పలువురు డైరెక్టర్లు సైతం ప్రమాణ స్వీకారం చేశారు.

ట్రాన్స్‌కో ఏఈకి సన్మానం

రొద్దం: మండలంలో విధులు నిర్వహిస్తున్న ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌రావును సోమవారం మండల కేంద్రంలో రైతులు, విద్యుత్ శాఖ సిబ్బంది కలిసి సన్మానించారు. విధి నిర్వాహణలో రైతులకు, ప్రజలకు ఆయన చేసిన సేవలకు ఉత్తమ అవార్డు రావడంతో రైతులు శాలవాలతో సత్కరించినట్లు తెలిపారు.

రోడ్డు సమస్యను పరిష్కరించండి

పెనుకొండ: పట్టణంలోని అక్కమ్మ గార్ల కాలనీలో రోడ్డు సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని పట్టణంలోని స్థానికులు మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్‌కు సోమవారం విన్నవించుకున్నారు. కాలనీ నుంచి మడకశిర రోడ్డులోకి నేరుగా రోడ్డు ఉందని, అయితే రిటైర్డ్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ రోడ్డుపై ఎత్తుగా సంప్ నిర్మించి ఇబ్బంది పెడుతున్నారన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు సరుకుల పంపిణీ

పెనుకొండ: స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో క్షయ వ్యాధిగ్రస్తులకు సోమవారం సంగ్యూ హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గోధుమపిండి, రాగి పిండి, శెనగలు, వేరుశనగ విత్తనాలు, కందిబ్యాళ్లు అందజేశారు. వైద్యులు ఉదయకిరణ్ సంగ్యూ హైటెక్ దాతృత్వాన్ని కొనియాడారు.

ఆధ్యాత్మిక శోభ



అగళి: అలంకరణలో జడేశంకరేశ్వరస్వామి



గుడిబండ: అలంకరణలో మల్లేశ్వరస్వామి



రొళ్ల మండలం కొడగార్ల గుట్టలో బసవేశ్వరస్వామి



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



అమరాపురం: వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



పావగడ: జ్యోతులు మోస్తున్న భక్తులు

అమరాపురం: దక్షిణ గొల్లహట్టిలో సోమవారం యాదవ కులస్తుల ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుడు హరీష్‌భట్టాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహన్ని రథంపై కలువుదీర్చారు. భక్తులు స్వామి వారి రథాన్ని ఆలయం నుంచి ఉన్నత పాఠశాల వరకూ రథాన్ని లాగారు.

వీరభద్రస్వామికి..

మండల పరిధిలోని గౌడనకుంటకు వెళ్లే రహదారిలో వెలసిన వీరశైవ లింగాయతుల ఆరాధ్య దైవం వీరభద్రస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అర్చకులు రవిస్వామి అభిషేకాలు చేశారు.

అగళి: మండల కేంద్రంలోని జడేశంకరేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, పంచామృతాలతో శివలింగానికి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

రొళ్ల: మండల పరిధిలోని కొడగార్లగుట్ట గ్రామ సమీపాన కొండపై వెలసిన బసవేశ్వరస్వామికి ఆఖరి శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సమీప గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో స్వామివారికి జ్యోతులను సమర్పించారు.

గుడిబండ: మండల కేంద్రంలో ఉన్న కొండపై వెలసిన మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

పావగడ: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని పట్టణంలో వెండి రథంపై శ్రీకృష్ణుని చిత్రపటాన్ని ఊరేగించారు. జయ కృష్ణ ముకుందా మురారీ అంటూ శ్రీకృష్ణుడిని కీర్తించారు. పెద్ద సంఖ్యలో యాదవ మహిళలు జ్యోతులు మోశారు.

భక్తిశ్రద్ధలతో ఊరేగింపు

గోరంట్ల: మండ కేంద్రంలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు నిర్మాణానికి పరిశీలన

పెనుకొండ రూరల్: సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు కోసం అధికారులతో కలసి బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సోమవారం పరిశీలించారు. 44వ జాతీయ రహదారికి అనుసంధానంగా కొత్తచెరువు, పుట్టపర్తికి వెళ్లే రహదారిని మంత్రి పరిశీలించారు. నిత్యం ఈ రహదారి గుండా కొత్తచెరువు, పుట్టపర్తి, గోరంట్ల నుంచి కియా పరిశ్రమకు వాహనాల రద్దీ ఉండటంతో సర్వీసు రోడ్డు నిర్మాణం కోసం మంత్రి రహదారిని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

హిందూపురం డివిజన్

9912220723, 9494767933, 9912220726